క్లుప్తంగా

ప్రీప్రైమరీ స్కూల్ నిర్వహణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో విజయకుమారి, సూపర్‌వైజర్లు

కొయ్యూరు: చీడిపాలెం పంచాయతీ సింగవరం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ప్రీ ప్రైమరీ చిన్నారుల విద్య, ఆరోగ్యంపై చర్యలను సీడీపీవో విజయకుమారి అంగన్వాడీ వర్కర్లకు వివరించారు. సిలబస్ ప్రకారం పూర్తి చేయాల్సిన గణాంకాలపై అవగాహన కల్పించారు. పిల్లలతోనే కూరగాయలు ధరలు ప్రకటించారు. ఒక్కో దానిపై పిల్లలు అవగాహన పెంచుకునేందుకు వీలుగా నెలకు ఒక అంశాన్ని తీసుకోవాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



సింగరయ్య (ఫైల్)

గంగవరం : గంగవరం మండలం కొత్తాడ గ్రామానికి చెందిన కారం సింగరయ్య (20) అనే వ్యక్తి అదృశ్యం అయినట్లు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. గత కొద్ది రోజులుగా తన భర్త కనిపించడం లేదని కారం సింగరయ్య భార్య కారం వరలక్ష్మి సోమవారం ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. సింగరయ్య ఆచూకీ తెలిస్తే గంగవరం పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఆయన చెప్పారు.

దగ్ధమైన చోడి కుప్పలు



బల్లుగూడలో దగ్ధమైన చోడి పంట కుప్పలు

ముంచంగిపుట్టు: మండలంలో గల బాబుశాల పంచాయితీ బల్లుగూడ గ్రామంలో రెండు చోడి కుప్పలు దగ్ధమయ్యాయి. దీంతో బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బల్లుగూడ గ్రామ సమీపంలో నూర్పిళ్లకు సిద్ధంగా ఉన్న చోడి కుప్పల పక్కన చిన్నారులు చలి మంటలు వేసుకొని కాస్తూ ఉండగా ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలు ఎగిరి కుప్పలపై పడ్డాయి. దీంతో కుప్పలు పూర్తిగా కాలి పోయాయి దగ్ధమయ్యాయి. దీనిని గమనించి రైతులు మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసే లోగా పూర్తిగా కాలి బూడిదైనట్టు స్థానికులు చెప్పారు. పంట చేతికి వచ్చే సమయంలో ఇలా జరగడంపై బాధిత రైతులు పాంగి బొజ్జన్న, కిల్లో అర్జున్ వాపోతున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.15వేల నష్టం జరిగినట్టు తెలిపారు. ఏవో శ్రీనివాసబాబు జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించారు.

ప్రయాణికులకు తప్పని పాట్లు



బస్టాప్ సౌకర్యం లేక ఆరుబయట బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని నూతన హైవే నిర్మాణంతో గతంలో ఉన్న బస్సు కాంప్లెక్స్‌ను తొలగించడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రస్తుతం హైవే అధికారులు బస్సు కాంప్లెక్స్‌ను ప్రధాన బజారు నుంచి పెట్రోల్ బంకు వద్ద ఉన్న తహసీల్దార్ కార్యాలయం వద్దకు మార్చారు. అయితే ఇక్కడ బస్టాప్ లేకపోవడంతో ఎండైనా.. వానైనా ప్రయాణికులకు ఆరుబయట నిరీక్షణ తప్పడం లేదు. గతంలో మెయిన్ రోడ్డు బస్సు కాంప్లెక్స్ ఉండడంతో ఎంతో సౌకర్యంగా ప్రయాణికులు చెబుతున్నారు. ప్రస్తుతం బస్ కాంప్లెక్స్ దూరంగా ఏర్పాటుచేయడంతో ఇబ్బందుల తప్పడం లేదంటున్నారు. అలాగే చాపరాయి వద్ద ఉన్న కాంప్లెక్స్ దూరంగా నిర్మించడంతో నానా అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు, పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



సీజనల్ వ్యాధులపై నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది (ఫైల్)

అప్రమత్తతే ఆరోగ్య మంత్రం

చలికి దూరంగా ఉండాలి

గోరు వెచ్చని నీరు తాగాలి

చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి

ఆహార నియమాలు తప్పనిసరి

శీతాకాలంలో వేడివేడి పకోడీలు, పిజ్జాలు లాంటివి తింటారు. అలాంటి ఆహార పదార్థాలకు విరామం ఇవ్వాలి. లేకుంటే ఆరోగ్యం ప్రమాదకరంగా మారుతుంది. పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆకుకూరలు, కూరగాయలు సీ, కె, విటమిన్లు పుష్కలంగా ఉండే పదార్థాలను తీసుకోవాలి. పోషక విలువలు అధికంగా ఉండే క్యారెట్, బీట్‌రూట్ తీసుకోవడం ఎంతో మేలు. మసాలాతో కూడిన ఆహార పదార్థాలతో ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రస్తుత సీజన్‌లో కూల్ డ్రింక్‌లు, ఫ్రిడ్జ్‌లలో ఉంచిన వాటిని తీసుకోవడం ప్రమాదకరం. దగ్గు, జలుబు, జ్వరం బారినపడే అవకాశాలు ఎక్కువ. గోరు వెచ్చని నీటిని తాగితే ఉపశమనం కలుగుతుంది. దూమపానానికి దూరంగా ఉండడం మంచిది.



చలిమంట వద్ద గిరిజనులు

కొయ్యూరు: శీతాకాలం కావడంతో మన్యంలో చలి పంజా విసురుతోంది. వాతావరణంలో పెను మార్పుల కారణంగా రోగాలు ప్రబలుతున్నాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న చిన్నపిల్లలు, వృద్ధుల పరిస్థితి దారుణంగా ఉంది.ముఖ్యంగా జలుబు, తలనొప్పి లాంటివి ఎక్కువగా వస్తున్నాయి. దీంతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. వెళ్లే వారి సంఖ్య పెరుగుతుంది. రోగాల బారిన పడుకుండా ఉండాలంటే శీతాకాలం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. చల్లటి వాతావరణంలో ఎక్కువ సమయం గడపకూడదని చెబుతున్నారు. సాధ్యమైనంత వరకు వేకువజామున , రాత్రి వేళ్లలో బయటకు వెళ్లకుండా ఉండడం మంచిదంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకొస్తే తప్పనిసరిగా మఫ్లర్, స్వెట్టర్లు, చేతికి ఉన్ని గ్లౌజులు, కాళ్లకు బూట్లు వంటివి ధరించాలని సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు వారి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు సైతం సరైన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ఎలాంటి రోగం వచ్చినా వెంటనే ఆస్పత్రికి వెళ్లి వెంటనే చికిత్స పొందాలని సూచిస్తున్నారు. ఈ మేరకు వైద్య నిపుణులు అందిస్తున్న సూచనలివీ...

వ్యాయామం తగ్గించాలి

శీతాకాలంలో తెల్లవారు జామున పొగమంచు, చల్లటి గాలులు వీస్తాయి. దీని మూలంగా శ్వాసకోస వ్యాధులతో బాధపడేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాయామం చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. గంటల కొద్దీ ఆరుబయట, మైదాన ప్రాంతాల్లో తిరగడం తగ్గించాలి. ఇంట్లోనే వ్యాయామం చేయడం ఉత్తమం

తస్మాత్ జాగ్రత్త

మన్యంలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు గణనీయండా పడిపోయి చలి తీవ్రత పెరుగుతుంది. చలితో రక్తనాళాలు సంకోచిస్తాయి.దీని మూలంగా అవయవాలకు రక్తప్రసరణ చేసే గుండె మరింత వేగంగా పనిచేయాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. రక్త సరఫరాలో ఆక్సిజన్ శాతం తగ్గితే గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మధుమేహం, ఆస్తమా ఉన్న వారికి శీతాకాలం శత్రువు లాంటిదే. ఈ కాలంలోనే శరీరానికి ఎక్కువగా వ్యాధులు వస్తాయని చెబుతున్నారు. గుండెలో నొప్పిలా అనిపిస్తే వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచిస్తున్నారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో వారిని బయటకు రానివ్వకుండా చూడాలంటున్నారు. వృద్ధులు జాగర్తలు తీసుకోకుంటే వైరస్‌లు దాడి చేసే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. పెంపుడు జంతువులకు ఈ కాలంలో దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. వైరస్‌లు వ్యాప్తికి పెంపుడు జంతువులు కూడా కారణమని వైద్యులు చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారు పెంపుడు జంతవులకు దూరంగా ఉండాలని చెబుతున్నారు.



కురుస్తున్న మంచు

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



శీతాకాలంలో వేడినీటిని తాగడం ఆరోగ్యంకరం. మిరియాల పాలు తాగడం ద్వారా జలుబు నుంచి ఉపశమనం పొందవచ్చు. దగ్గు వదలకుండా వస్తుందంటే కొంత వామును నమలడం మేలు. వేడి నీటిని తాగడం ఉత్తమం. జలుబు చేసినప్పుడు పసుపు, బామ్‌తో కలిపి ఆవరిపడితే త్వరితగతిన ఉపశమనం కలుగుతుంది. ఈ కాలంలో బాలింతలు వారి బిడ్డతో కనీసం 20 నిమిషాలైనా ఎండలో ఉండడం మంచిది.

– డాక్టర్ జయప్రకాశ్, వైద్యుడు, చీడిపాలెం

క్రికెట్ టోర్నీ ప్రారంభం

అడ్డతీగల: ఏటా సంక్రాంతి పండుగ పురస్కరించుకుని అడ్డతీగల కేంద్రంగా నిర్వహించే అల్లూరి సీతారామరాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం స్థానిక జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ప్రారంభమైంది. అల్లూరి యూత్ ఆధ్వర్యంలో ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్టు టోర్నీ నిర్వాహకులు తెలిపారు.

9న మండల సమావేశం

అరకులోయటౌన్: అరకులోయ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 9న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో అడపా లవరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రంజపల్లి ఉషారాణి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హజరు కావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికలతో పాటు పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు విధిగా పాల్గొవాలని, సమావేశానికి గైర్హజర్ అయితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు ఎంపీడీఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదాలను నివారించండి



ఎంపీపీ బంధం శ్రీదేవి

రంపచోడవరం: మండలంలోని ఐ.పోలవరం నుంచి సీతపల్లి వరకు వెళ్లే రహదారిలో అనేక ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోయారని రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. సీతపల్లి ఆర్అండ్ఆర్ కాలనీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం ఎంతో కలసివేసిందన్నారు. భార్యభర్తలు మోటార్ బైక్ ప్రయాణిస్తుండగా, ఒక్కసారిగా లారీ ఢీకొన్న ప్రమాదంలో భార్య కళ్లేదుటే భర్త చనిపోయిన ఘటన హృదయ విదారకమన్నారు. ఈ రోడ్డులో ఇప్పటివరకు జరిగిన ప్రమాదాల్లో సుమారు 15 మంది వరకు ప్రాణాలు కోల్పోయి ఉంటారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్డుపై ప్రమాదా నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ ఆడుతున్న యువత

రాజవొమ్మంగి: వివేకానంద స్వామి జయంతిని (జాతీయ యువజన దినోత్సవం) పురస్కరించుకొని మండలంలోని నెల్లిమెట్ల గ్రామంలో సోమవారం వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. గ్రామపెద్దలు రిబ్బన్ కట్ చేసి ఈ పోటీలు ప్రారంభించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ఈ పోటీలు ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ తాము సూరిబాబు అన్నారు. పోటీలు ఈనెల 11వ తేదీ వరకు కొనసాగుతాయని, మొత్తం 32 టీంలు పాల్గొంటున్నట్టు తెలిపారు. కమిటీ సభ్యులు గాం. దీ, ఆదినారాయణ, చిన్న నాగరాజు, వెంకటరమణ, రమేష్, మల్లిదొర, శ్రీనివాస్, రామకృష్ణ, భీమరాజు తదితరులు పర్యవేక్షించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

ప్రశాంతంగా పీసా కమిటీ ఎన్నికలు



ఎన్నికైన వారికి నియామకపత్రాలు అందజేస్తున్న అధికారులు

డుంబ్రిగుడ: మండలంల కేంద్రంలోని పీసా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. ఈ నెల 3 వ తేదీ నుంచి చేపడుతున్న పీసా ఎన్నికలతో గ్రామాల్లో సందడి నెలకొంది. సంబంధిత ఎన్నికల అధికారులు ఓటరు జాబితాను ప్రదర్శించి సభ్యుల మెజార్టీని పరిగణంలో తీసుకుని ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రం డుంబ్రిగుడ, బల్లుగుడ గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. డుంబ్రిగుడ మండల పీసా కమిటీ ఉపాధ్యక్షుడిగా తుడుము శంకర్‌రావు, కార్యదర్శిగా మండ్యా గురు. సింహాద్రి. ఎన్నికయ్యారు. వీరికి అధికారులు, ప్రజాప్రతినిధులు నియామకపత్రాలను అందజేశారు.

అడ్డతీగల: మండలంలోని వేటమామిడిలో పీసా గ్రామ కమిటీ ఎన్నికను సోమవారం ఎన్నికల అధికారి వి.శివరామ చందు నిర్వహించారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, వేటమామిడి సర్పంచ్ మడకం రాజమ్మ, స్థానికులు గ్రామసభలో పాల్గొన్నారు. గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడిగా మద్దికొండ బహుదూర్, కార్యదర్శిగా దాని రమణారెడ్డి ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి శివరామ చందు తెలిపారు. వారికి ఎంపీపీ బొడ్డపాటి రాఘవ చేతుల మీదగా నియామకపత్రం అందించారు. అనంతరం పీసా గ్రామ కమిటీ విధులు, బాధ్యతలపై ఎన్నికల అధికారి శివరామ చందు వివరించారు.

సారూ.. స్పందించరూ..

- ఐటీడీఏ పీవో కార్యాలయం చెంతనే కుప్పలు
- రోజుల తరబడి తొలగించని చెత్త
- దుర్గంధంతో సతమతం
- పట్టించుకోని యంత్రాంగం



ఐటీడీఏ పీవో కార్యాలయం వెనుక పేరుకుపోయిన చెత్తకుప్పలు

పాడేరు రూరల్: ఐటీడీఏ పీవో కార్యాలయం వెనకాల రేకుల కాలనీ మార్గంలో గత మూడురోజుల నుండి చెత్త చెదరాలను పేరుకుపోయి రహదారి అంత డంపింగ్ యార్డుల తలపిస్తుంది. ఈ మార్గం మీదుగా ఉమెన్స్ హాస్టల్, పీఎంఆర్‌సీ, జీసీసీ చైర్మన్ క్యాంప్ కార్యాలయం ఉంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చె ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.

పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడ పబడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు. పరిసరాల ప్రాంతంలో నివాస గృహలు, ప్రభుత్వ అతిథి గృహలు, ఉమెన్స్ హాస్టల్స్ ప్రభుత్వ క్యాంటీన్ కూడా ఆనుకుని ఉండడంతో మరింత రోగాల బారిన పడే ప్రమాదం ఉందని స్థానిక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

ఇప్పటికైన ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేసి పేరుకుపోయిన చెత్తలను తక్షణం తొలగించి నిత్యం పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

గంగవరం: మండల కేంద్రంలోని జిల్లా బీజేపీ నాయకుడు పుట్ట గంగయ్య ఆధ్వర్యంలో మండల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మండల కమిటీ ఎన్నిక జరిగింది.మండల పార్టీ అధ్యక్షురాలుగా పుట్టపల్లి చిన్న నీలాలమ్మ ఏకగ్రీవం ఎన్నుకున్నారు. ఎన్నికకు జిల్లా పార్టీ అధ్యక్షుడు రాజారావు, నాయకులు కొండలదొర, భారతి, బొజ్జిరెడ్డి, స్వప్నకుమారి, వెంకటేశ్వర దొర, సూర్యచంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం

కొయ్యూరు: బీఎస్ఎన్ఎల్‌తో పాటు ప్రేవేటు సంస్థల సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాంకేతిక సమస్య మూలంగా బీఎస్ఎన్ఎల్ సేవలు నిలిచిపోయాయి. దీంతో పాటు జియో సిగ్నల్స్ కూడా కొద్దిసేపు స్తంభించడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. బీఎస్ఎన్ఎల్ నెట్ స్తంభించడంతో బ్యాంకులు, పలు ప్రభుత్వ శాఖల ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలిగింది. బీఎస్ఎన్ఎల్ సర్వీసులు తరచూ నిలిచిపోతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వినియోగదారులు చెబుతున్నారు. ఇప్పటికై నా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

21న ఉపాధి పనులపై ప్రజావేదిక

అరకులోయటౌన్: మండల కేంద్రంలో జనవరి 21న ఉపాధి హామీ పథకం పనులపై ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఏపీవో జె.జగదీశ్వరరావు తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈనెల 4వ తేదీ నుంచి గ్రామాల్లో సోషల్ ఆడిట్ జరుగుతుందన్నారు. సోషల్ ఆడిట్ పూర్తయిన తరువాత 21న ప్రజావేదిక ఉంటుందన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జరిగే కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, పాల్గొవాలన్నారు. రాజు, పవన్‌కుమార్, తదితరులు పాల్గొంటారన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దుతుగా ప్రచారం



రఘువర్మకు మద్దుతుగా ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

చింతపల్లి: ఉపాధ్యాయ శాసన మండలి సభ్యునిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరుతూ చింతపల్లిలో ప్రచారాన్ని నిర్వహించారు.సోమవారం మండల కేంద్రంలో గల ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలు సందర్శించి ఎంఎల్‌సీగా రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ప్రచారం చేశారు,

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి



సేంద్రియ సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త బిందు

చింతపల్లి: వ్యవసాయంలో సేంద్రియ పద్ధతుల సాగుతో ఆరోగ్యకరమైన, అధిక దిగుబడులు సాధించవచ్చని చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త సీహెచ్.బిందు అన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సేంద్రియ వ్యవసాయంపై వారం రోజులు శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐదవ రోజు గ్రామీణ యవతకు పలు అంశాలను వివరించారు. పరిశోధనలు జరుపుతున్న పసుపు అల్లం, మిరియాలు తదతర పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు విధానాన్ని వివరించారు. జీకేఎంఎస్ ప్రాజెక్టు రిసోర్స్ అసోసియేట్ డాక్టర్ సునీల్‌కుమార్, సమీకృత వ్యవసాయ పద్ధతులలో కలుపు యాజమాన్యం అవగాహన కల్పించారు. శిక్షకులందరూ ఉద్యాన పరిశోధన స్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మిరియాలు, అల్లం, పసుపు నిల్వ పద్ధతులను ఉద్యాన శాస్త్రవేత్త బిందు అవగాహన కల్పించారు.

క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు



సర్టిఫికెట్లతో క్రీడా పోటీల్లో విజేతలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విశాఖలోని నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో అరకు బ్లాక్‌లో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ పోటీల్లో భాగంగా కబడ్డీలో కె.శాంతి టీమ్, వాలీబాల్‌లో మైథిల్ కుమార్ టీమ్‌లు ప్రథమ స్థానంలో నిలిచాయి. 1కె రన్, హై జంప్‌లో మైథిల్ కుమార్ విన్నర్‌గా, లాంగ్ జంప్‌లో బి.రాజ్‌కుమార్ ప్రథమస్థానాన్ని కై వసం చేసుకున్నట్టు జిల్లా యువజన క్రీడల అధికారి జి.మహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుష్పరాజ్, ఎన్ఎస్ఎస్ పీఓలు నాగబాబు, విజయలక్ష్మి, అనిత కుమారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. క్రీడా పోటీలను పీడీ ఎస్.అప్పారావు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న మెహందీ పోటీలు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం ఉమెన్ ఎన్‌పవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మెహందీ పోటీలను నిర్వహించారు.ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ ఆదేశాల మేరకు కన్వీనర్ సుందరీరాణి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పోటీల్లో విజేతలకు సంక్రాంతి పండుగరోజు బహుమతులు అందజేస్తామని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుష్పరాజ్ తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు చెత్త తొలగింపు



గుంటసీమ రోడ్డుపై పేరుకుపోయిన చెత్త (నాడు)



గుంటసీమలో చెత్త తొలగింపు పనులు పర్యవేక్షిస్తున్న కార్యదర్శి విజయ్ (నేడు)

సాక్షి ఎఫెక్ట్..

డుంబ్రిగుడ: మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోవడంతో పెరుగుతున్న దోమలు. దుర్గందంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సమస్యపై 'ముక్కుమూసుకోవాల్సిందే' అనే శీర్షికతో గత నెల 20న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా గుంటసీమ వెళ్లే రోడ్డు మార్గంతో పాటు పలు చోట్ల పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించే పనులను సోమవారం చేయించారు. ఎట్టకేలకు చెత్త తొలగించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కారానికి చొరవ చూపిన 'సాక్షి'కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్పందించిన పంచాయతీ అధికారులపై హర్షం వ్యక్తం చేశారు.